ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -9 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 4 మే 2026

# గెలిచేదెవరో...?

## నేడు ఎన్నికల ఫలితాలు -ఎగ్జిట్ పోల్స్‌లో నిఖార్సెంత..?

## తేలనున్న కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ భవితవ్యం

చెన్నై **మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌లో నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఈ ఎన్నికల ఫలితాలు దేశ భవిష్యత్ రాజకీయాలకు దిశానిర్దేశం చేయనున్నాయి. వామపక్షాలు, టీఎంసీ, డీఎంకే, కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఫలితాలు కీలకం కానున్నాయి.

### పటిష్ట భద్రత

పై రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలవుతుంది. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించేందుకు,**మిగతా 2లో...**




# ఒప్పందం చేసుకోండి..
# లేకుంటే విపత్తే

## ట్రంప్ బెదిరింపులు

## దౌత్యమా..యుద్ధమా.. నిర్ణయించుకోవాల్సింది అమెరికానే : ఇరాన్



**మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌పై మళ్లీ దాడి చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో పాటు మూడు కీలక అంశాలైన అణు కార్యక్రమం, హోర్ముజ్ దిగ్బంధనం, భద్రతా హామీలు వంటి అంశాలపై ఇప్పటికీ ప్రతిష్టంభన**మిగతా 2లో...**



# నీట్ ప్రశాంతం

**అమరావతి మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
వైద్య విద్య కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)-2026 ఆది వారం ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) దేశవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించింది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకు న్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 552 పట్టణాల్లో, విదేశాల్లోని 14 పట్టణాల్లో కలిపి 5,432 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించింది. ఆ తరువాత ఎవరినీ అనుమ తించలేదు.**మిగతా 2లో...**

# బకాయిలు ఎలా?

- సింగరేణి సంస్థకు విద్యుత్ శాఖ బకాయి
- అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచే!..
- నేడు క్యాబినెట్‌లో వాటి రికవరీపై చర్చ
- వాయిదాల వారీ చెల్లించే అంశంపై నిర్ణయం..
- భూముల విలువల రెట్టింపు.. బహదూర్‌గూడలో బస్ టెర్మినల్ ఏర్పాటుపైనా చర్చ
- విద్యుత్తు సబ్‌స్టేషన్ల పక్కన సోలార్ ప్లాంట్ల నిర్మాణం.. ఖజానాకు వనరుల సమీకరణ..
- ఆర్టీసీ విలీనం.. ఉద్యోగులకు 6 వేల కోట్ల చెల్లింపుపైనా చర్చించనున్న క్యాబినెట్

**హైదరాబాద్, మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో విద్యుత్ శాఖకు వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి పెద్దమొత్తంలో బకాయిలు ఉన్న విషయాన్ని సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. ఇరిగేషన్ శాఖ నుంచి పలు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.26 వేల కోట్లు, మిషన్ భగీరథ రూ.5వేల కోట్లు, పంచాయతీరాజ్, మునిసిపాలిటీలు కలిపి రూ.6 వేల కోట్లతోపాటు పలు**మిగతా 2లో...**





# నింగిలోకి మిషన్ దృష్టి

- భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం..
- బెంగళూరు స్టార్టప్ గెలాక్సీఐ స్పేస్ 'మిషన్ దృష్టి' శాటిలైట్ విజయవంతం
- స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగం
- దేశంలోనే ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌గా రికార్డు
- ఇది భారత యువత ఆవిష్కరణల పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనమన్న ప్రధాని మోదీ

2లో.

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

- పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ
- కస్టమర్ల ముసుగులో వచ్చి రెచ్చిపోయిన ఐదుగురు దుండగులు
- నగలు దోచుకుంటూ.. అడ్డుకున్న సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు
- రక్తపు మడుగులో నలుగురు ఉద్యోగులు.. ఒకరి పరిస్థితి విషమం




2లో.

# 'స్వచ్ఛ రథం' సూపర్ హిట్

- పంచాయతీల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సిద్ధమైన వాహనాలు



**అమరావతి, మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛ రథం' దూసుకుపోతోంది. గ్రామాల్లో ప్లాస్టిక్, ఇతర పొడి వ్యర్థాలను నిరోధించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకొచ్చిన ఈ పథకం సత్ఫలితాలనిస్తోంది. 'చెత్తతో సంపద' నినాదంతో ఒక్క ఏప్రిల్‌లోనే రాష్ట్రవ్యాప్తంగా**మిగతా 2లో...**

# పవన్ కల్యాణ్ 'మ్యాజిక్ డ్రెయిన్స్' ఒక గేమ్ ఛేంజర్

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలను ప్రశంసించిన పీవీ సింధు
- 'మ్యాజిక్ డ్రెయిన్స్' గ్రామీణ పారిశుద్ధ్యంలో విప్లవాత్మక మార్పు అని వ్యాఖ్య
- సాధారణ డ్రెయిన్లతో పోలిస్తే 80 శాతం ఖర్చు ఆదా అవుతుందని వెల్లడి
- పవన్ ముందుచూపుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్ష


**హైదరాబాద్, మే 3, (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వినూత్న ఆలోచనలతో గ్రామీణాంధ్రప్రదేశ్ రూపురేఖలు మారుస్తున్నారని, ఆయన ప్రవేశపెట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్స్' పథకం పల్లెల్లో పారిశుద్ధ్య విప్లవానికి నాంది పలికిందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు కొనియాడారు. పవన్ కల్యాణ్ 20 నెలల పాలనపై తన అభిప్రాయాలను పంచుకుంటూ విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో, గ్రామీణ ప్రాంతాల్లోని మురుగునీటి సమస్యకు **మిగతా 2లో...**



# గెలిచేదెవరో...?

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికల సంఘం (ఈసీ) ఈసారి వినూత్నంగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫోటో గుర్తింపు కార్డు విధానాన్ని ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానాల లెక్కింపు 77 కౌంటింగ్ కేంద్రాల్లో జరగనున్నది. ఈ రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఇక్కడ గతంలో ఎన్నడూ లేనట్టు 92.47 శాతం అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. అలాగే ఇక్కడి దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫాల్తా' నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణలో ఉల్లంఘనలు జరిగిన కారణంగా అక్కడి ఎన్నికలను రద్దు చేశారు . ఆ స్థానానికి మే 21న తిరిగి ఎన్నికలు జరగనున్నాయి. అసోంలో 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యం నేడు వెల్లడికానుంది. ఇక్కడ 40 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతున్నది.



కేరళలో రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) మూడోసారి కూడా అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 883 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. మొత్తం 140 కౌంటింగ్ కేంద్రాలను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ వరుసగా రెండోసారి అధికారాన్ని దక్కించుకోవాలని ఆశిస్తోంది. ఇక్కడి ఎన్నికలువిభిన్నమైన రాజకీయ వాతావరణంలో జరిగాయి. డీఎంకే ప్రధాన ప్రత్యర్థి అయిన ఏఐడీఎంకేతో పాటు, నటుడు, రాజకీయ నాయకుడు విజరు నేతృత్వంలోని టీవీకే వంటి కొత్త పార్టీలు కూడా ఈసారి ఎన్నికల బరిలో నిలిచాయి.

### ఎగ్జిట్ పోల్స్‌లో నిఖార్సెంత..?

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిశాక..మోడీ అనుకూల కార్పొరేట్ మీడియా ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేసింది. అందులో తమకు అనుకూలమైన రీతిలో సీట్లు వస్తాయని ప్రచారం చేసుకున్నాయి. వాస్తవానికి ఇప్పటికీ ఓటరు నాడి ఏమిటో అంతుచిక్కలేదు. ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాక కూడా భిన్నమైన ఫలితాలతో అసెంబ్లీ ముఖ చిత్రాలు మారిన చరిత్ర గతంలో ఉంది. అంతిమంగా బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థులు, పార్టీల భవితవ్యం భద్రంగా ఉంది. ఉదయం 11 గంటలలోపు తొలి ట్రెండ్ ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

## పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ

**కరీంనగర్ మే 3, (రిపబ్లిక్ న్యూస్):**

కరీంనగర్ నగరం నడిబొడ్డున, ప్రశాంతంగా గడిచిపోతున్న ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జ్యోతినగర్‌లోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో పట్టపగలు తుపాకుల మోత మోగింది. అత్యంత పకడ్బందీగా, పక్కా స్కెచ్‌తో కస్టమర్ల ముసుగులో లోపలికి ప్రవేశించిన ఐదుగురు దుండగులు క్షణాల్లోనే తుపాకులతో భయానక వాతావరణం సృష్టించారు. హాలీవుడ్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించేలా అడ్డుకోబోయిన సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి, నెత్తుటేరులు పారించి, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఈ దుస్సాహస ఘటన యావత్ తెలంగాణలో కలకలం రేపగా, దొంగల వేట కోసం పోలీస్ యంత్రాంగం నగరవ్యాప్తంగా నాకాబందీ విధించి జల్లెడ పడుతోంది. ఉదయం 10.45 గంటల ప్రాంతం. సిబ్బంది లాకర్ల నుంచి నగలు తీసి డిస్‌ప్లేలో పెడుతున్నారు. పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు.. అత్యంత అనువైన సమయం చూసి దాడికి దిగారు. రెండు బైక్‌లపై (బ్లాక్ పల్సర్, వైట్ అపాచీ) ఐదుగురు వ్యక్తులు వచ్చారు. ముందుగా ఒకరు లోపలికి వచ్చి 20 గ్రాముల చైన్ కావాలని అడిగాడు. సిబ్బంది చూపిస్తున్న క్రమంలోనే మిగతా నలుగురు లోపలికి ప్రవేశించారు. కస్టమర్ల ముసుగులో వచ్చిన వారు క్షణాల్లో తుపాకులు బయటకు తీశారు. భయానక వాతావరణం సృష్టించి, షట్టర్లు మూసేసి షోరూమ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

**ప్రాణాలకు తెగించిన సిబ్బంది..**

లోపలికి రాగానే దొంగలు సిబ్బంది చేతులు వెనక్కి కట్టేసి లాకర్లు తెరవాలని బెదిరించారు. వాష్‌రూమ్‌లో భయంతో దాక్కున్న ఓ మహిళను సైతం బయటకు లాక్కొచ్చి నింపాదిగా నగలు బ్యాగుల్లో సర్దుకున్నారు. అయితే, ఈ



క్రమంలో షోరూమ్ మేనేజర్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న దొంగలు విచక్షణారహితంగా 7 నుంచి 8 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు ఉద్యోగులు బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలారు. వీరిలో ఒకరి తలకు గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### పారిపోతూ గాలిలోకి ఫైరింగ్.. దొరికిన కీలక ఆధారాలు

నగలు దోచుకున్న అనంతరం దుండగులు బయటకు పరుగులు తీశారు. అప్పుడు కూడా గాయాలతోనే సిబ్బంది వారిని వెంబడించగా, దొంగలు గాలిలోకి కాల్పులు జరుపుతూ బైక్‌లు స్టార్ట్ చేశారు. ఆ కంగారులో ఒక దొంగ కిందపడిపోగా, నగలున్న ఓ బ్యాగ్ కూడా అక్కడే పడిపోయింది. అంతేకాకుండా, వారి తుపాకీకి చెందిన మ్యాగజైన్, మూడు ఖాళీ బుల్లెట్ షెల్స్, ఒక కత్తి ఘటనా స్థలంలో పడిపోయాయి. వారు హిందీ, తెలుగు మాట్లాడుతున్నారని, ఉత్తరాదికి చెందిన అంతర్రాష్ట్ర ముఠాగా అనుమానిస్తున్నారు. వీరు సిరిసిల్ల వైపు పరారైనట్లు పోలీసులు గుర్తించారు.

సమాచారం అందుకున్న వెంటనే ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మాస్కులు లేని నలుగురు నిందితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సరిహద్దులను దిగ్బంధించి హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలంలో దొరికిన మ్యాగజైన్, తూటాలు కంట్రీ మేడ్ వెపన్స్‌వా? లేక ఎక్కడైనా కొనుగోలు చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటన జరిగిన సమయానికి సమీపంలోనే ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజరు కుమార్ వెంటనే షోరూమ్ వద్దకు చేరుకున్నారు. సిబ్బంది చూపిన తెగువను ప్రశంసించిన ఆయన, మెరుగైన వైద్యం కోసం బాధితులను హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, హుజూరాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తదితరులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు స్పందిస్తూ.. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి**

సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా, లేదా బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌లపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపించినా.. వెంటనే డయల్ 100 లేదా 8712670744, 8712670745 నంబర్లకు సమాచారం అందించాలని కరీంనగర్ పోలీసులు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బకాయిలు ఎలా?

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు కలిపి మొత్తం సుమారు రూ.55 వేల కోట్లకు పైగా విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉంది. ఇటీవల నిర్వహించిన పలు సమీక్షల్లో అధికారులు ఈ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు విద్యుత్ శాఖ కూడా సింగరేణి సంస్థకు రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఏవైనా అవసరాల నిమిత్తం ప్రభుత్వం రుణాల కోసం బ్యాంకులు, ఇతర సంస్థల వద్దకు వెళ్లినప్పుడు.. ఈ బకాయిల అంశం తెరపైకి వస్తోంది. రుణాలను తిరిగి చెల్లించేందుకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం శాఖ పరిస్థితిని పరిశీలించి ఆయా బ్యాంకులు, సంస్థలు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయన్న విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో బకాయిల అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఏయే సంస్థలు ఎంత మేర బకాయిలు ఉన్నాయి, చెల్లింపులకు ఉన్న అవకాశాలేంటన్న దానిపై చర్చించి, వాయిదాల పద్ధతిలో విద్యుత్ శాఖకు చెల్లించేలా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీంతోపాటు పలు కీలక అంశాలపై క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో జిల్లాకు రెండు చొప్పున సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయంగా నెలకొంటున్న యుద్ధ వాతావరణం, రోజురోజుకూ పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో సర్కారు ఈ దిశగా ఆలోచిస్తోంది. ప్రతి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి, పూర్తి సోలార్ పవర్‌ను సరఫరా చేయాలని భావిస్తోంది. అంతేకాకుండా ఆ గ్రామాల్లో గ్యాస్ స్టవ్‌లు వాడకుండా పూర్తి సోలార్ స్టవ్‌లను అందించేందుకు ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ విషయంపైనా మంత్రివర్గంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇక రాష్ట్ర ఖజానాకు వనరుల సమీకరణపై దృష్టి సారించిన ప్రభుత్వం.. అందుకు ఉన్న అవకాశాలను గుర్తిస్తోంది. ఇప్పటికే పలు సంస్థల పరిధిలోని ఆస్తులను వేలం వేస్తూ ఆదాయం రాబడుతోంది. తాజాగా వనరుల సమీకరణ కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ.. ఇటీవల వరుసగా వివిధ ప్రభుత్వ శాఖలతో భేటీ అవుతోంది. ఆ భేటీల్లో వనరుల సమీకరణకు ఉన్న మార్గాలను గుర్తించి ఒక నివేదికను రూపొందించినట్టు తెలిసింది. ఆ నివేదికను క్యాబినెట్ ముందుంచి దానిపై చర్చించనున్నారు. అనంతరం వనరుల సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్టీసీ కార్మికులతో చర్చల సందర్భంగా ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ పట్ల ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఆ కారణంగానే కార్మికులు సమ్మెను విరమించినట్టు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న ఆందోళన చేపడతామని ఉద్యోగ సంఘాల జేఏసీ ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం వారితోనూ సమావేశమై చర్చలు జరిపింది. వారి సమస్యల్లో కీలకమైన ఆర్థిక అంశాలను పరిష్కరిస్తామని చెప్పింది. ఇందులో భాగంగా రానున్న వంద రోజుల్లో రూ.6వేల కోట్లను చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా అందుకు ఉన్న అవకాశాలపైనా చర్చించి, చెల్లింపులపై ప్రకటన చేయనున్నట్లు సమాచారం. పీఆర్సీ, డీఏల వ్యవహారంపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి, ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గాలపై క్యాబినెట్‌లో లోతుగా చర్చించనున్నారు. దీంతోపాటు కొత్త రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపైనా చర్చించనున్నారు. ఉద్యమకారుల సంక్షేమ సంఘం విధివిధానాల ఖరారుపై చర్చించనున్నారు.

**బస్ టెర్మినల్, మెట్రో రెండో ఫేజ్‌పై చర్చ**

హైస్పీడ్ రైల్ కారిడార్ కోసం శంషాబాద్‌లోని బహుదూర్‌గూడ సమీపంలో ఇప్పటికే 500 ఎకరాల స్థలం అందుబాటులో ఉండగా, మరో 150 ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. అక్కడే హైస్పీడ్ రైలు, మెట్రో, బస్సులతోపాటు విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ పేరుతో భారీ నిర్మాణాన్ని చేపట్టే అంశంపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, మెట్రో రెండో ఫేజ్‌ను ఏ పద్ధతిలో నిర్మించాలి, పీపీపీ మోడల్‌లో ముందుకు వెళ్లాలా, లేక కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వెళ్లాలా అనేదానిపై చర్చించనున్నారు. ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా, మరోసారి డీపీఆర్‌ను పంపించి.. నిధులు, సంబరొాధిత అంశాలకు సహకరించాలని కోరే విషయంపై కీలకంగా చర్చించనున్నట్లు తెలిసింది. ఇక ఐఐటీ–బాసర (ఆర్‌జీయూకేటీ)కు యూనివర్సిటీ హోదా కల్పించే అంశంపైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో అభివృద్ధి చేయదలచిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలోని రోడ్ల టెండర్లలో ఎక్సెస్ రేట్ల వ్యవహారం తెరపైకి వచ్చినందున.. దీనిపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

**కార్పొరేషన్ల చైర్మన్ల జాబితా సిద్ధం!**

రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లకు కొత్త చైర్మన్‌లను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న చైర్మన్‌ల పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో కొత్త వారిని నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన జాబితా కూడా సిద్ధమైనట్లు, దీనిపై క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్నవారిలో ఐదారుగురు మినహా మిగిలిన వారందరినీ కొత్త వారిని నియమించనున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

# ఒప్పందం చేసుకోండి.. లేకుంటే విపత్తే

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగుతోంది. మరోవైపు ట్రంప్ ను ఏమాత్రం నమ్మలేమని ఇరాన్ అంటోంది. సముద్రపు దొంగల్లాంటి వాళ్లమంటూ ప్రకటనతో కూడా ఇరాన్ మరింత అప్రమత్తమైంది. అందుకే మా వ్యూహాల్లో మేం ఉన్నామంటూ ప్రతిస్పందిస్తోంది. దీంతో యుద్ధం జరగవచ్చనే భయాన్ని రేకెత్తిస్తోంది.

ప్రతి వారం కొత్త సవరణలతో ప్రతిపాదనలు వస్తున్నా, ఏవీ ఆమోదం పొందడం లేదు. ఇరాన్ ఒకప్పుడు ఉన్నంత బలంగా ఇప్పుడు లేదని ట్రంప్ అంటున్నారు. ఆయన ప్రకారం, వారికి ఒప్పందం కావాలి. వారు పూర్తిగా బలహీనపడ్డారు. తమ నాయకుడు ఎవరో కూడా వారికి అర్థం కావడం లేదు. వారు నిస్సహాయులు. అని యూఎస్ అధ్యక్షుడు పేర్కొంటున్నారు. ఒప్పందం కుదరకపోతే ఏమి జరుగుతుందనేదే అతిపెద్ద ప్రశ్న. సైనిక చర్య ఒక ప్రత్యామ్నాయం అని ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు.

"నేను ఇప్పుడే చెప్పలేను, కానీ వారు తప్పుడు నిర్ణయం తీసుకుంటే, అది సాధ్యమే" అని ఆయన అన్నారు. అమెరికా దాడి చేసే అవకాశాన్ని తెరిచి ఉంచుకుంటోందని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు తీవ్రమవుతూనే ఉన్నాయి. అమెరికా దిగ్బంధనం ఇరాన్ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపింది.

ఇరాన్‌పై సైనిక చర్యకు అవకాశం ఉన్నదని ట్రంప్ సూచనప్రాయంగా చెప్పారు. 'వారి ప్రవర్తన సరిగా లేకపోతే, వారు చెడ్డ పని చేస్తే ఏం చేయాలో చేస్తాం. సైనిక చర్యకు అవకాశం ఉంది కచ్చితంగా' అని ఆయన ఫ్లోరిడాలో తెలిపారు. కాగా ఇరాన్‌పై యుద్ధం చేయడానికి తనకు కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా చట్టం ప్రకారం సైనిక చర్య చేపట్టాలంటే దేశాధ్యక్షుడికి ప్రతినిధిసభ అనుమతి తప్పనిసరి. అయితే ట్రంప్ తాజాగా కాంగ్రెస్ సభ్యులకు లేఖ రాస్తూ యుద్ధ అధికారాల చట్టానికి తాను కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 7వ తేదీ నుంచి కొనసాగుతోందని, కాబట్టి ఫిబ్రవరి 28న ప్రారంభమైన శత్రుత్వం ముగిసిందని గుర్తు చేశారు. ఇదిలావుండగా హోర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్‌కు వ్యక్తులు కానీ, కంపెనీలు కానీ టోల్ చెల్లిస్తే తమ ఆంక్షలను ఉల్లంఘించినట్లు అవుతుందని అమెరికా ఆర్థిక శాఖ ఓ నోటీసులో హెచ్చరించింది.

# నింగిలోకి మిషన్ దృష్టి

## భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం..

**హైదరాబాద్, మే 3, (రిపబ్లిక్ న్యూస్):**

భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ 'గెలాక్సీఐ స్పేస్' అభివృద్ధి చేసిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. దేశీయ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో ఇది ఒక కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.సుమారు 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి', ఇప్పటివరకు ఒక భారతీయ ప్రైవేట్ సంస్థ నిర్మించిన అతిపెద్ద ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' (రాజుశీూా=) టెక్నాలజీ కలిగిన శాటిలైట్ కావడం విశేషం. ఈ విజయంతో గెలాక్సీఐ స్పేస్, అంతరిక్ష సాంకేతికతలో సరికొత్త హద్దులను చెరిపేస్తున్న స్టార్టప్‌ల సరసన నిలిచింది.ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. గెలాక్సీఐ వ్యవస్థాపకులు, యావత్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'లో స్పందిస్తూ, "మన అంతరిక్ష ప్రయాణంలో గెలాక్సీఐ వారి మిషన్ దృష్టి ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తుంది. ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ శాటిలైట్, భారతదేశంలో ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించడం మన యువత ఆవిష్కరణల పట్ల, దేశ నిర్మాణం పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

# నీట్ ప్రశాంతం

**మొదటిపేజీ తరువాయి**

దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. 28 పట్టణాల్లో 180 పరీక్ష కేంద్రాలను ఎన్‌టిఎ ఏర్పాటు చేసింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 11,496 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 11,345 మంది పరీక్షకు హాజరయ్యారు. గుంటూరు జిల్లాలో 8,417 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 8,299 మంది, శ్రీకాకుళం జిల్లాలో 1,951 మంది దరఖాస్తుదారులకు 1904 మంది, విశాఖపట్నంలో 8,112 మందికి 7,987 మంది, కర్నూలులో 4,928 మందికి 4,807 మంది హాజరయ్యారు. బయాలజీ, కెమిస్ట్రీ కంటే ఫిజిక్స్ విభాగం కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా ఉండటం వల్ల ఎక్కువ సమయం దానికే వెచ్చించాల్సి వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నీట్ ఆన్సర్ 'కీ'–ని ఎన్‌టిఎ 15 రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉంది.

# పవన్ కల్యాణ్ 'మ్యాజిక్ డ్రెయిన్స్' ఒక గేమ్ ఛేంజర్

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకం ఒక అద్భుతమైన పరిష్కారమని ఆమె అభివర్ణించారు.

ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడుతూ, "పాలనా వ్యవహారాలలో కొత్తే అయినా, పవన్ కల్యాణ్ గారు వినూత్న కార్యక్రమాలతో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. మన దేశంలో అధిక శాతం ప్రజలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు. అయితే, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థ పెద్ద సవాలుగా ఉంటుంది. ఈ సమస్యకు పవన్ కల్యాణ్ గారు 'మ్యాజిక్ డ్రెయిన్స్' రూపంలో ఒక చక్కటి, శాశ్వత పరిష్కారాన్ని కనుగొన్నారు" అని అన్నారు.మ్యాజిక్ డ్రెయిన్స్ పనితీరును వివరిస్తూ, "ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీటిని ఇంకుడు గుంతలతో కూడిన ఈ డ్రెయిన్లు క్షణాల్లో భూమిలోకి ఇంకేలా చేస్తాయి. మూడంచెల ఫిల్టర్ బెడ్ల ద్వారా నీటిని శుద్ధి చేసి, భూగర్భ జలంగా మారుస్తాయి. దీనివల్ల మురుగునీరు నిల్వ ఉండటం, దుర్వాసన రావడం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఈ డ్రెయిన్లు కీలక పాత్ర పోషిస్తాయి" అని సింధు వివరించారు.

ఈ పథకం వల్ల ఖర్చు కూడా గణనీయంగా ఆదా అవుతుందని ఆమె పేర్కొన్నారు. సాధారణ సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణంతో పోలిస్తే, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ వ్యయం 80 శాతం వరకు తక్కువగా ఉంటుందని తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు.

"పవన్ కల్యాణ్ గారు భవిష్యత్తులో కూడా ఇలాంటి ముందుచూపుతో కూడిన కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, పవన్ కల్యాణ్ దార్శనికతతో గ్రామీణాంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పీవీ సింధు తన సందేశాన్ని ముగించారు.

# 'స్వచ్ఛ రథం' సూపర్ హిట్

**మొదటిపేజీ తరువాయి**

1866 టన్నుల వ్యర్థాలను సేకరించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మార్చి నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ రథం వాహనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి నెలలోనే రికార్డు స్థాయి ఫలితాలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణుల నుంచి మొత్తంగా 1866 టన్నుల పొడి చెత్తను సేకరించి.. దానికి బదులుగా రూ.3.31 కోట్ల విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. ఏప్రిల్ 2న నిర్వహించిన స్కూల్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి ఒక్కరోజే ఒక టన్ను పొడి చెత్తను సేకరించారు. పర్యావరణం పట్ల ప్రజల్లో, విద్యార్థుల్లో పెరుగుతున్న సామాజిక స్పృహకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.


# వైసిపి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని





**కల్లూరు ప్రతినిధి, మే03 (రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు మండలం, చెట్లమల్లాపురం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాకలి మధు సోదరుడు సురేంద్ర (చిన్నోడు) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, వాహనం వెనక్కి తీస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి గ్రామానికి చేరుకుని, మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సురేంద్ర మృతి చాలా దురదృష్టకరమని, కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు

# అలసందగుత్తి గ్రామ యువకుడు శివకు కర్నూలు జిల్లా అర్బన్ రిపోర్టర్‌గా అవకాశం



**కర్నూలు ప్రతినిధి, మే 03(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఆదోని మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన యువకుడు శివకు జిల్లా స్థాయి అర్బన్ రిపోర్టర్‌గా అవకాశం లభించింది. మండల స్థాయి నుంచే ప్రజా సమస్యలు, వివిధ కేసులు వంటి అంశాలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ, ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వకుండా ప్రజలకు సేవ చేస్తూ గుర్తింపు పొందారు. ఈ క్రమంలో ఆయన పనితీరును గుర్తించి నియోజకవర్గ స్థాయిలో ఎంపిక చేయగా, ప్రస్తుతం కర్నూలు జిల్లా అర్బన్ రిపోర్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు . జర్నలిజం రంగంపై ఆసక్తి, కృషి వల్ల ఈ స్థాయికి చేరుకున్నట్లు శివ తెలిపారు

# గుట్టపాడు పశువులకు వేసే మేతఅగ్నిప్రమాద బాధిత రైతును పరామర్శించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



**ఓర్వకలూ ప్రతినిధి, మే 03 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో పసులకు వేసే గడ్డి మేత అగ్నిప్రమాదానికి గురికావడం చాలా బాధాకరమని అన్నారు,రైతు మహబూబ్ బాషాను పరామర్శించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి. ఈ ఘటనలో సుమారు రూ. 6 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిసి, వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వం తక్షణం బాధిత రైతుకు ఆర్థిక సహాయం అందించి, పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు, గుట్టపాడు వైసిపి ఆర్కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు





# పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమం నిర్వహణ

**సరైన ధ్రువపత్రాలు లేని మోటార్ సైకిల్ లకు జరిమాన... అక్రమ మద్యం బాటిల్లు స్వాధీనం**

**ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కార్డెన్ అండ్ సెర్చ్**





**నంద్యాల క్రైం, మే 3, (రిపబ్లిక్ న్యూస్):** ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని పాములపాడు పెంచికలపల్లి గ్రామం నందు ఆదివారం తెల్లవారుజామున నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ సూచనలతో పాములపాడు సబ్ ఇన్స్పెక్టర్ తిరుపాల్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెంచికలపల్లి గ్రామంలో రౌడీ షీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి నివాసాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సోదాలలో అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని మోటర్ సైకిళ్లకు జరిమాన విధించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రజల భద్రత కోసం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ ఆపరేషన్లు చేపట్టడం జరిగింది. అనంతరం సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు మొదలగు వాటిపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించడం జరిగింది.

# గూడూరులో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సత్కారం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 3)**
కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు పట్టణంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

తన ప్రసంగంలో ఎమ్మెల్యే మహిళలపై నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కుటుంబ హింసను అరికట్టే మార్గాలు, సైబర్ నేరాలపై అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందే విధానాలపై వివరించారు. స్వీయ రక్షణ పద్ధతుల ప్రాముఖ్యతను కూడా వివరించారు.

మహిళల భద్రతకు సంబంధించిన చట్టపరమైన హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న భద్రతా చర్యల గురించి తెలియజేస్తూ, మహిళలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి భయాందోళనలకు లోనవకుండా ధైర్యంగా ముందుకు రావాలని, సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే "స్త్రీ శక్తి" యాప్ ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమాజం మొత్తం కలిసి సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గూడూరు నగర కమిషనర్, సీఐ తబ్రేజ్, ఎస్ఐ రాజా కుళాయప్ప, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.





# బేతంచర్ల లో ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విద్యా, వైద్యం, ఉపాధి, హక్కుల కోసం నిరంతర పోరాటాలు**

**బేతంచెర్ల ప్రతినిధి, మే 03 (రిపబ్లిక్ న్యూస్)**
బేతంచర్ల పట్టణంలోని సిపిఐ కార్యాలయ ఆవరణంలో అఖిల భారత యువజన సమాఖ్య ,ఏఐవైఎఫ్, 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల నాయకులు మధు అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర సమితి సభ్యులు భార్గవ్.యన్న హాజరై ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో యువజనుల హక్కులకోసం పోరాడి, అసువులు బాసిన అమరవీరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న అఖిల భారత యువజన సమాఖ్య ,ఏఐవై ఎఫ్,
యువతకు విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ, దేశం కోసం ప్రాణ తర్పణం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, ఆశయ సాధన స్ఫూర్తితో 1959 మే 3వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో ఏఐవైఎఫ్ ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు



యువజన, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సమరశీల ఉద్యమాలను నిర్వహించిదని, 18 సంవత్సరాలు వచ్చిన యువతీ యువకులు అందరికీ ఓటు హక్కు కల్పించడం కోసం పోరాటం నిర్వహించి ఏఐవైఎఫ్ విజయం సాధించిందన్నారు, దేశంలో ఎంతో నైపుణ్యం కలిగిన యువతీ యువకులు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, దేశ అభివృద్ధికి, ఉత్పత్తి రంగంలో యువతను జోక్యం చేసుకోకుండా పాలకులు అడుగడుగున యువతకు ఆటంకం కలిగించడమే, నేడు భారతదేశం ఉన్న దుస్థితికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు దేశంలో వైద్య రంగాన్ని జాతీయం చేయాలని, ప్రజలకు వైద్యం ఉచితంగా అందించాలని, ఏఐవైఎఫ్ ఎన్నో పోరాటాలు నిర్వహించింది అన్నారు, దేశ ప్రజలందరూ తమ రక్త మాంసాలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కారుచౌకగా అమ్మడంతో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నవి కూడా ఊడిపోవడంతో దేశంలోని యువత పెద్ద ఎత్తున నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు, ప్రతిసంవత్సరం డిఎస్సి నిర్వహించి, అన్ని రకాల శాఖలలో ఖాళీలను పూర్తి చేయాలన్నారు ఏఐవైఎఫ్ లక్ష్యాల సాధన కోసం నేటి యువత భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి డి.దస్తగిరి, ఏఐవైఎఫ్ నాయకులు ప్రసాద్, అస్లామ్, రాముడు, ఇద్రుస్, షెక్షావలి, సుబ్బయ్య, వంశీ, శ్రీను, ఆయన్ తదితరులు పాల్గొన్నారు

# రూ.1.05కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

**ప్రారంభించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**



**అనంతపురం (రాప్తాడు) సంక్షేమం, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రతి అభివృద్ధిలోనూ పరిటాల అనే పేరు కనిపిస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మండలంలోని బి.యాలేరు, రంగంపేట గ్రామాల్లో ఆదివారం ఆమె సీసీరోడ్లను ప్రారంభించారు. ముందుగా బి.యాలేరు గ్రామానికి చెందిన గ్రామస్థులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులతో కలిసి శివాలయం వద్ద రూ. 35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును పండుగ వాతావరణంలో ప్రారంభించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను కూడా ఆమె ప్రారంభించారు. ఆ తర్వాత రంగంపేట గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే సునీతకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఆమెకు పూల వర్షంతో స్వాగతం పలికారు. ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు రూ.70 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించి గ్రామంలోకి నడిచి వెళ్లారు. గ్రామానికి రోడ్డు వేయించినందుకు గ్రామస్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**కట్ట క్రింద సిమెంట్ కాంక్రీట్ వాల్, రోడ్డు నిర్మాణం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ బి.యాలేరు, రంగంపేట గ్రామాలంటే తమకు ప్రత్యేకమైన అభిమానమన్నారు. ఈ గ్రామాల్లో ఏ అభివృద్ధి జరిగినా తమ ద్వారానే జరిగిందన్నారు. యాలేరులో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, చెరువు మరమ్మత్తులు, హంద్రీనీవా ద్వారా నీరు, కమ్యూనిటీ హాల్, దేవాలయాల అభివృద్ధి, బి.యాలేరు నుండి చెరువు మరువ దాకా రూ. 25 లక్షలతో సిసి రోడ్డు వేసి పొలాలకు పోయే రైతులకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. శ్రీ నాగనందీశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భం 2014 సంవత్సరం నుంచి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిస్తూ.. గెలుపొందిన వారికి బహుమతులను ఇస్తున్నామన్నారు. భక్తులు, గ్రామ పెద్దలు దేవాలయం దగ్గర సిమెంట్ రోడ్డును నిర్మించాలని అడిగిన వెంటనే రూ.35 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి రోడ్డు నిర్మించామన్నారు. రోడ్డుకు ఇరువైపులా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సోలార్ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇటు రంగంపేటలో కూడా హంద్రీనీవా - పి.ఏ.బి.ఆర్ కాలువల ద్వారా చెరువుకు నీరు ఇవ్వడం, రంగంపేట చెరువుకు కోటి రూపాయలతో మరమ్మతు పనులు, చెరువు కట్ట క్రింద సిమెంట్ కాంక్రీట్ వాల్, రోడ్డు నిర్మాణం, స్మశానవాటికకు సిమెంటు రోడ్డు, కాలువలకు కల్వర్టులను ఏర్పాటు చేయడం, అంగన్వాడి, పాఠశాల భవనాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపట్టామన్నారు. అనంతపురం - తగరకుంట మెయిన్ రోడ్డు నుంచి మాధవరాజుల స్వామి దేవాలయం వరకు రూ.40 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు, బీసీ ఎస్సీ కాలనీలతో పాటు గ్రామంలోని అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. తాము ఎన్నికల వరకే పార్టీలు చూస్తామని.. గ్రామాల్లో చేయాల్సిన పనుల విషయంలో రాజకీయాలు చేయమని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

రిపబ్లిక్


# జిల్లాలో సజావుగా నీట్ పరీక్షలు నిర్వహణ

## 16 కేంద్రాల్లో పరీక్షలు 97.54% హాజరు నమోదు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 3)**
జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తయ్యాయని ఇంచార్జి జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. ఆదివారం నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి నిర్వహణపై సమీక్షించారు.
న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ (మైనార్టీస్), ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, టౌన్ మోడల్ హైస్కూల్, కెవిఆర్ ప్రభుత్వ కళాశాల, ఇందిరా గాంధీ మెమోరియల్ స్కూల్, రాయలసీమ యూనివర్సిటీ, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్ వంటి కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4,928 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 4,807 మంది పరీక్షకు హాజరయ్యారని, 121 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఈ మేరకు 97.54 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.
పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు బయోమెట్రిక్ నమోదు, హాల్ టికెట్ తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు.విద్యార్థులకు త్రాగునీరు, వైద్య సహాయం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా కల్పించినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.
సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ అభినందించారు.

# ఘనంగా బీజేపీ జెండా ఆవిష్కరణ



**అనంతపురం,సంక్షేమం, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భగీరథ సర్కిల్ బస్టాండ్ సమీపంలో, వేణుగోపాల్ సర్కిల్ వద్ద బీజేపీ జెండాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకుండా రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిద్ధం రాజు, మీడియా ప్రతినిధి వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.

**ఆవిష్కరణలు నిర్వహించడం పార్టీ విస్తరణకు సంకేతం**
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదగడం కార్యకర్తల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వలాభం ఆశించకుండా పనిచేసే కేడర్ బలం వల్లే పార్టీ ఈ స్థాయికి చేరిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీ బలం పెరుగుతోందని తెలిపారు. అనంతపురం నగరంలోని ప్రతి డివిజన్‌లో స్వచ్ఛందంగా కార్యకర్తలు ముందుకు వచ్చి జెండా ఆవిష్కరణలు నిర్వహించడం పార్టీ విస్తరణకు సంకేతమన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని, బూత్ స్థాయిలో బలమైన కేడర్‌తో ప్రజల్లోకి వెళ్లనున్నామని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు మారుతి గోవింద్ ప్రసాద్, నాగరాజు, రాణి నగర్ మండల అధ్యక్షుడు సాకే చిరంజీవి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు తేజేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్యతో పాటు పలు మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**జూలై వరకు సరిపడా 3.64 టీఎంసీల నీటి నిల్వలు -పొదుపుగా నీటిని వినియోగించాలని ప్రజలకు కమిషనర్ పిలుపు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 3)**
వేసవి తీవ్రత నేపథ్యంలో కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నగరపాలక సంస్థ ముందస్తుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం కీలక నీటి వనరులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.
సుంకేసుల జలాశయం, మునగాలపాడు నీటి శుద్ధి కేంద్రం, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆయన ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలిసి సందర్శించారు. నగరానికి నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు జలవనుల శాఖతో సమన్వయం మెరుగుపరచాలని ఆదేశించారు. శుద్ధి కేంద్రాల్లో మరమ్మత్తులు తక్షణమే చేపట్టి, నీటి శుద్ధి ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాల్సిందిగా సూచించారు.
సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని హెచ్చరించిన కమిషనర్, శుద్ధి కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 3.64 టీఎంసీల నీటిని నిల్వ చేసినట్లు వెల్లడించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 0.16 టీఎంసీలు, సుంకేసుల జలాశయంలో 1.2 టీఎంసీలు, గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా 2.28 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈ నిల్వలు జూలై నెలాఖరు వరకు నగరానికి తగినంతగా ఉంటాయని స్పష్టం చేసిన ఆయన, ప్రజలు నీటిని అవసరానికి మాత్రమే వినియోగించి వృథా చేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్ గా హారిక

**విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



**అనంతపురం (శింగనమల) ఎడ్యుకేషన్, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**
పదవ తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్ గా హారిక ప్రథమ స్థానం సాధించింది. అనంతపురం జిల్లా శింగనమల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని ఆర్. హారిక విద్యను అభ్యసించింది. జిల్లా టాపర్ గా మార్కులు సంపాదించిన హారికను శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి సత్కరించారు. నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండలం, ముంటిమడుగు గ్రామానికి చెందిన హారిక, కల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్తు హై స్కూల్ నుండి జిల్లా ప్రథమ స్థానంలో 592/600 మార్కులు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. 10వ తరగతిలో హారిక కు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఆమె తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.
**ఉన్నత చదువుల కొరకు హారిక కు అండగా ఉంటాం:** ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, ఐ.టి.,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్ల సమవేశాలతో విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదమైందన్నారు. పరీక్షల ముందు ప్రత్యేక ప్రణాళిక కారణంగా పరీక్షలులో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించడంలో లోకేష్ చొరవ కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉన్నత చదువుల కొరకు హారికకు కూటమి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి తెలిపారు.

# ఘనంగా ఏఐవైఎఫ్ 67వ వ్యవస్థాపక దినోత్సవం

**యువత సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరం : ప్రభుత్వ వైఫల్యాలపై నేతల విమర్శలు**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 3)**
అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నగర కార్యదర్శి బిషన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు జెండా ఆవిష్కరణ నిర్వహించారు.ఈ సందర్భంగా నక్కి లెనిన్ బాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామాంజనేయులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మునెప్పలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో యువత పోషించిన కీలక పాత్రను గుర్తు చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ థాపర్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.
ప్రస్తుతం దేశం మరియు రాష్ట్రంలో యువత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, నిరుద్యోగం ప్రమాదకర స్థాయికి చేరుకుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పనలో, ఖాళీ పోస్టుల భర్తీలో పూర్తిగా వైఫల్యం చెందిందని తీవ్రంగా విమర్శించారు. ప్రైవేటీకరణ, ఒప్పంద ఉద్యోగాల విధానాలు యువత భవిష్యత్తును అస్థిరతలోకి నెట్టుతున్నాయని అన్నారు.
విద్యా రంగంలో పెరుగుతున్న ఖర్చులు సాధారణ కుటుంబాలపై భారమవుతూ ఉన్నత విద్య అందకుండా చేస్తున్నాయని, వైద్య రంగంలో ప్రైవేటీకరణ కారణంగా నాణ్యమైన సేవలు ప్రజలకు దూరమవుతున్నాయని తెలిపారు. చదువు పూర్తి చేసిన యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక నిరాశ, అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు.
యువతకు గౌరవప్రదమైన ఉద్యోగాలు కల్పించడం, నిరుద్యోగ భృతి అమలు చేయడం, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రెండు సంవత్సరాలు గడిచినా ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నదని అన్నారు. ఉపాధి లక్ష్యంగా ఏఐవైఎఫ్ భవిష్యత్ ఉద్యమాలు కొనసాగుతాయని, యువత అందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జి. చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, నాయకులు చంటి, అఖిల్, రాజశేఖర్, వీరయ్య, రవి, నరేష్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి చేసిన మనిషా నాయర్ ను అరెస్ట్ చేయాలి

## ములకనూరు డాబా రమేష్ హెచ్చరిక



**అనంతపురం (కుందుర్పి) క్రైమ్, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**
రిపోర్టర్ లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి భౌతిక దాడులకు పాల్పడిన గీతం నిర్వాహకురాలు మనీషా నాయర్‌తో పాటు ఆమె అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా ఉద్యమ నాయకుడు ములకనూరు డాబా రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కుందుర్పి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.జర్నలిస్ట్ లక్ష్మీనారాయణపై దాడి చేసి, చేయరాని తప్పుకు కాళ్లు మొక్కించుకుని అవమానించిన తీరు సమాజాన్ని తలదించుకునేలా చేసిందని ఆయన మండిపడ్డారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను అక్షరరూపంలో ప్రజలకు తెలియజేయడం పాత్రికేయుడి ధర్మమని పేర్కొన్నారు.వార్తపై అభ్యంతరం ఉంటే చట్టపరంగా కోర్టును ఆశ్రయించవచ్చని, కానీ గుండాగిరితో దాడులు చేయడం అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో దళితులపై, జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వంలో సామాన్యుడికి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామని డాబా రమేష్ హెచ్చరించారు.

# పొగాకు రవాణాలో ప్రమాదంలో మృతి చెందిన షేక్ ఖాజాముద్దీన్ రైతు కుటుంబాన్ని పరామర్శించిన పాణ్యంమాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి

**ఓర్వకల్లు ప్రతినిధి, మే 03 (రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలంలోని ఓర్వకల్లు పట్టణానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ కాజముద్దీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే ఏప్రిల్ 30న కర్నూలు చిన్నమ్మ సర్కిల్ వద్ద తన ట్రాక్టర్‌లో పొగాకు బేళ్లు తరలిస్తుండగా, అతివేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా, మే 2న చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇది సాధారణ ప్రమాదం మాత్రమే కాదు, ఊ× టబాకో కంపెనీ నిర్లక్ష్యం వల్ల జరిగిన దుర్ఘటన. ఓర్వకల్లులోనే గోడౌన్ ఉన్నప్పటికీ స్థానికంగా కొనుగోలు చేయకుండా,



రైతులను ఆత్మకూరు, అల్లంపూర్ వంటి దూర ప్రాంతాలకు పొగాకు తరలించమని ఒత్తిడి చేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి" అని విమర్శించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతుల నుంచి స్థానికంగానే పొగాకు కొనుగోలు జరిగేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీది వేముల ప్రభాకర్



రెడ్డి , ఓర్వకల్లు జడ్పీటీసీ రంగనాథ్ గౌడ్ , కాశిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి , పాణ్యం మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, పాణ్యం నియోజకవర్గం ఐటీ విభాగం అధ్యక్షుడు శివ కృష్ణారెడ్డి , తోట పురుషోత్తం రెడ్డి , చంద్ర శేఖర్ రెడ్డి , సుధాకర్ రెడ్డి , నాగలింగేశ్వర రెడ్డి , మంజీర్ భాష, బషీర్, భాస్కర్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, జెల్ల కృష్ణ,హరి కృష్ణ ,దిలీప్, రాజేష్, అల్లాస్వామి ఓర్వకల్లు మండల మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండ ఆలయంలో కిక్కిరిసిన భక్తజనం

**చౌడేపల్లి ప్రతినిధి మే 03 రిపబ్లిక్ న్యూస్**



శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో బోయకొండ ప్రాంతం భక్తజనసంద్రమైంది. కొండ దినాన్ని పురస్కరించుకొని వేద పండితులు అర్చకుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ఉదయాన్నే విశేష అభిషేకాలు అలంకరణ నిర్వహించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం భక్తులకు మౌలిక వసతులు సమకూర్చారు.

## సాంప్రదాయబద్ధంగా విజయ వినాయక స్వామి
# నవగ్రహ దేవతల ప్రాణ ప్రతిష్ట



**చౌడేపల్లి ప్రతినిధి మే 03 రిపబ్లిక్ న్యూస్**



విజయ వినాయక స్వామి నవగ్రహ దేవతలు నాగదేవతలు విమాన గోపుర కలశ ప్రతిష్ట కుంబాభిషేక మహోత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు విజయవాణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయ వాణి నగర్ నందు ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు తొలి రోజున గోపూజ ఆలయ ప్రవేశము గణపతి పూజ తో ప్రారంభమై రెండవ రోజున కలశార్చన అంగహోమము జలాధివాసము వంటి కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు మూడవ రోజున ప్రాణ ప్రతిష్ట ప్రధాన హోమాలు నాడీ సంధానము కలాన్యాప హోమము అష్టపల్లి ప్రధాన పూర్ణాహుతి కుంబాభిషేకము పంచామృతాభిషేకము రుద్రాభిషేకము విశేష అలంకరణ మహా మంగళహారతి అష్టావధాన సేవ తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు హోమాది కార్యక్రమాలలో విజయవాణి విద్యాసంస్థల అధినేతలు నాయుని చంద్రకళ ,నాయుని చంద్రశేఖర్ మూర్తి, నాయని విజయనిర్మల, నాయుని సుధాకరమూర్తి, నాయుని జయమ్మ, నాయుని పద్మ కుమారి, నాయుని మహేష్ బాబు, నాయుని కరుణ, నాయునీ వారి కుటుంబ సభ్యులు పాల్గొనగా విజయవాణి సంస్థల సిబ్బంది చౌడేపల్లి మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు విశేష పూజలు ముక్కులు చెల్లించుకున్నారు.

ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే హరికథ కచేరి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో విజయ వినాయక స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యువత సమస్యల పరిష్కారానికి
# తక్షణ చర్యలు అవసరం

### అఖిల భారత యువజన సమాఖ్య



**అనంతపురం ప్రతినిధి, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**

విద్య, వైద్యం, శాస్త్రీయ సామాజికవాద లక్ష్యాల సాధన కోసం 1959 మే 3న ఢిల్లీలో స్థాపించబడిన అఖిల భారత యువజన సమాఖ్య దేశవ్యాప్తంగా యువత హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ యువజన సంస్థగా కొనసాగుతోంది. ఇది భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థగా ఉండి, అంతర్జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య యువజనుల ప్రపంచ సమాఖ్యకు అనుబంధంగా, ఆ సంస్థ సాధారణ మండలిలో సభ్యత్వం కలిగి ఉంది. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య దినోత్సవాన్ని అనంతపురం నగరంలోని నవయుగ కాలనీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నగర అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు జి. సంతోష్ కుమార్ పాల్గొనగా, జెండా ఆవిష్కరణను మాజీ జిల్లా నాయకులు సి. మల్లికార్జున నిర్వహించారు.

**మహనీయుల త్యాగస్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకం**

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో యువత పోషించిన పాత్రను గుర్తు చేస్తూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ థాపర్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగస్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. ప్రస్తుతం దేశం మరియు రాష్ట్రంలో యువత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, నిరుద్యోగం ప్రమాదకర స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**విద్యా రంగంలో ఖర్చులు సాధారణ కుటుంబాలపై భారం**

ఈ క్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో, ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిన ప్రభుత్వంగా మారిందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ విధానాలు ప్రైవేటీకరణ, ఒప్పంద ఉద్యోగాలపై ఆధారపడుతూ యువత భవిష్యత్తును అస్థిరతలోకి నెట్టుతున్నాయని అన్నారు. విద్యా రంగంలో పెరుగుతున్న ఖర్చులు సాధారణ కుటుంబాలపై భారంగా మారి ఉన్నత విద్య అందకుండా చేస్తున్నాయని, వైద్య రంగంలో ప్రైవేటీకరణ ప్రజలకు నాణ్యమైన సేవలను దూరం చేస్తున్నదని తెలిపారు. చదువు పూర్తి చేసిన యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక నిరాశ, అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు.

**ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వాల బాధ్యత**

యువతకు ఉద్యోగాలు కల్పించడం, నిరుద్యోగ భృతి అమలు చేయడం, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని డిమాండ్ చేస్తూ, ఈ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవయుగ కాలనీ సిపిఐ కార్యదర్శి రాజు, నగర్ నాయకులు రాంబాబు, నిఖిల్, బండారు తేజ, రియాజ్, అశోక్, గణేష్, నాని, నవయుగ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పై దాడి చేసిన మనిషా నాయర్ ను తక్షణమే అరెస్టు చేయాలి

## ప్రశ్నిస్తే దాడులా.. ఖబర్దార్ మనిషా నాయర్ -ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన - జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

**అనంతపురం క్రైమ్, మే 03,(రిపబ్లిక్ న్యూస్):**

అనంతపురం నగరంలో గత కొన్ని రోజుల క్రితం శ్రీ గీతం విద్యాసంస్థల లో జరుగుతున్న అవకతవకలపై మనం జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ రెండు రోజుల క్రితం వార్త కథనం రాయడం జరిగింది. కథనం ప్రచురితం అనంతరం
శ్రీ గీత విద్యాసంస్థల యాజమాన్యురాలు మనిషా నాయర్ ఇంటికి వెళ్లి జర్నలిస్టుపై తన గూండా అనుచరులతో విచక్షణారహితంగా దాడి చేశారు. దౌర్జన్యంగా ఇంటికి వెళ్లి దాడి చేయడమే కాకుండా దాడి చేస్తున్నప్పుడు వాటిని
మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి అనంతరం సోషల్ మీడియాలో ప్రచురించడం జరిగింది. దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని మనిషా నాయర్ కాళ్లు మొక్కించుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు.







జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలపై కాసులకు కక్కుర్తిపడి అటువైపు కన్నెత్తి చూడకుండా కార్యాలయానికే పరిమితమైన ఆర్ఐవోను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు.

**మనిషా నాయర్ రౌడీ మూకలను వెంట పెట్టుకొని వెళ్లి ఇంట్లోకి చొరబడి దాడి**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి, భావ ప్రకటన స్వేచ్ఛకు హానికరమని తెలిపారు. జిల్లాలో వార్తలు రాస్తే జర్నలిస్టుల పైన బెదిరింపులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. శ్రీ గీతం విద్యాసంస్థల నిర్వాహకురాలు కళాశాలలో జరుగుతున్న అవకతవక్కలపై వార్త రాస్తే ఆ వార్త నిజమా అబద్ధమా అనేది పక్కన పెడితే ఒకవేళ మీకు అబద్ధం అనిపిస్తే ఆ వార్త రాసినటువంటి వ్యక్తి పైన కంప్లైంట్ ఇవ్వాలని లేకపోతే లీగల్ గా వెళ్లాలి కానీ వెనకాల మాకు సపోర్ట్ ఉంది కదా అన్న అహంకారంతో ఇంటికి వెళ్లి జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ పైన దాడి చేసి చిన్న పిల్లవాళ్లు కాళ్లు పట్టుకొని వదిలేయండి అని అడుగుతున్నా కనికరం లేకుండా జర్నలిస్టుతో కాళ్లు మొక్కించుకున్న మనిషా నాయర్ పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఉన్నటువంటి అనంతపురం జిల్లాలో ఇలాంటి వాళ్ల వల్ల ఫ్యాక్షన్ ను తలపించే విధంగా కొంతమంది రౌడీ మూకలను మనిషా నాయర్ వెంట పెట్టుకొని వెళ్లి ఇంట్లోకి చొరబడి దాడి చేసి మరి దాన్ని సోషల్ మీడియాలో పెట్టడం సమాజానికి ఏం తెలియజేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం దాడి చేయడమే కాకుండా సాయంత్రం ప్రెస్ క్లబ్ కు విచ్చేసి జర్నలిస్టులు నిరసన తెలియజేస్తుంటే వాళ్లను ఇష్టానుసారం మాట్లాడడం జర్నలిస్టుల పైకి కారు దూసుకుపోయే విధంగా వ్యవహరించడం సరికాదని తెలిపారు.

**ఆర్ ఐ ఓ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులకు ఊడిగం**

సోషల్ మీడియాలో శ్రీ గీతం విద్యాసంస్థల యాజమాన్యులు కళాశాలలో చేరితే ఉచితమని అంగులు ఆర్భాటాలతో ప్రచారం చేసుకొని పల్లెటూరు ప్రాంతాల విద్యార్థులు అమాయకత్వంలో ఉచితంగా విద్య వస్తుందన్నటువంటి ఆశతో కళాశాలకు వెళ్లి చేరితే అక్కడ కళాశాల చదువు ఏమో ఫ్రీ కానీ హాస్టల్ కు, మెటీరియల్ కు రకరకాల పేర్లతో లక్షల రూపాయలు గుంజుతున్నారు అది తెలియక అమాయకుల తల్లితండ్రులు సర్టిఫికెట్లు వాళ్ల చేతుల్లో ఇరికించి మోసపోతున్నారని పేర్కొన్నారు..శ్రీ గీతం విద్యాసంస్థల యాజమాన్యురాలు, దాడిలో పాల్గొన్నటువంటి వారిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులను దూషించిన ఘటన పైన మరొక కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులకు ఊడిగం చేస్తూ జిల్లాలో ప్రజా ప్రతినిధుల కళాశాల వైపు కన్నెత్తి చూడకుండా అటువైపు వెళ్తే నా పదవి ఊసిపోతుందన్న భయం మీలో ఉంటే తక్షణమే మీరు రాజీనామా చేసి వెళ్లిపోతే మరొకరు నీతి నిజాయితీ గల ఆఫీసర్ ఈ జిల్లాకు వస్తారు మీలాంటి వాళ్ల వల్ల ఈ జిల్లాలో చాలామంది విద్యార్థులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చేసే హంగులు ఆర్భాటాల వల్ల మోసపోయి కళాశాలలో చేరిన తరువాత బయటకు రాలేకకుండా ఇబ్బంది పడుతున్నటువంటి వందల మంది విద్యార్థులు ఉన్నారు. తక్షణమే శ్రీ గీతం విద్యాసంస్థలను సీజ్ చేయాలి శ్రీ గీత సంస్థల పైన చర్యలు తీసుకోకపోతే అనంతపురం నగరంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు నగర కోశాధికారి నాని నాయకులు సమీర్ సుశ్రీత్ బాబ్జాన్ దినేష్ బాబీ కార్తీక్ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# అంతర్జాతీయ శ్రామిక పోరాట దినోత్సవం

### ఘనంగా మేడే జెండా ఆవిష్కరణలు - లేబర్ కోడ్ల రద్దయ్యే వరకు పోరాడాలి

### జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ కార్మికులకు పిలుపు





**అనంతపురం / గుంతకల్లు, మే 03,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ఆదివారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో రామిరెడ్డి కాలనీ , ఉమామహేశ్వర నగర్ , భగత్ సింగ్ కాలనీ , ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఆటో స్టాండ్ , కసాపురం రోడ్ ఆటో స్టాండ్ లో మే డే జెండాను ఘనంగా ఆవిష్కరించారు.

**ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమలు**

ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక పోరాట దినోత్సవం మేడే జెండాల ఆవిష్కరణ మే 1 నుండి మే 5 వరకు ప్రతి సంవత్సరం నిర్వహించుకోవడం జరుగుతున్నదని అమెరికాలోని చికాగో నగరంలో 140 సంవత్సరాల క్రితం అక్కడి పెట్టుబడిదారులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం రోడ్ల మీదకు వచ్చి సమ్మె చేయడం జరిగింది . కార్మికుల ఆందోళన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసులు ద్వారా అణిచివేయాలని ప్రయత్నించడంతో పోలీసులు కాల్పులు జరపడంతో 4 కార్మికులు మరణించడం అనేకమందికి రక్త గాయాలు కావడం ఈ ఆందోళన కార్యక్రమానికి నాయకత్వం వహించిన కార్మిక నాయకులను ఆరు మందిని ఉరి తీయడం జరిగిందన్నారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం జరిగిందన్నారు.

**బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్లు**

బ్రిటిష్ ప్రభుత్వములోను తర్వాత అనేక పోరాటాల ద్వారా 29 కార్మిక చట్టాలను హక్కులను సౌకర్యాలను కార్మికులు సాధించారు. అయితే నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్లను తీసుకురావడం అత్యంత బాధాకరమన్నారు. దీనివలన కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ నిర్వీర్యం కావడం , లేబర్ కోడ్ల వలన కార్మికులు కట్టు బానిసలుగా యాజమాన్యాల మీద ఆధారపడి బతకవలసిన పరిస్థితి రావడం జరుగుతోందన్నారు. సమ్మె చేసే హక్కు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు పీఎఫ్ ఈఎస్ఐ గ్రాట్యుటి , ఇన్సూరెన్స్ , ఎక్స్ గ్రేషియా తదితర సౌకర్యాలు అన్ని యాజమాన్యాల మీద ఆధారపడి ఉంటాయి వీటిని చట్ట ప్రకారం పొందాలంటే సివిల్ కోర్టులకు వెళ్లే పరిస్థితి ఉండదు . అందువల్లనే కార్మికులు అనేక సంవత్సరాలుగా లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఆందోళన , నిరసన , సమ్మె కార్యక్రమాలు నిర్వహిస్తూ ముక్తకంఠంతో వ్యతిరేకించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కూడా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు పరచడానికి అతి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానాన్ని మారుస్తూ జీవో ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను , నాలుగు లేబర్ కోడ్లను రద్దు పరిచేంతవరకు ఆందోళన కార్యక్రమాలను కార్మిక వర్గం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకులు చంద్రప్ప , ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ సభ్యులు దావీదు రాజశేఖర్ శెట్టి రఘునాథ్ రెడ్డి రాందాస్ పిఓడబ్ల్యూ నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ మాబూనీ, పి డి ఎస్ యు నియోజవర్గం కార్యదర్శి వినోద్ భరత్ సాయి తదితరులు మాట్లాడడం జరిగినది. ఐ ఎఫ్ టి యు కమిటీ సభ్యులు షేక్షావలి భాష గోపి కృష్ణ ఈశ్వరయ్య దాదు బి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ..

## ఏటీజీహెచ్ వరకు క్యూలైన్లు



వారాంతం కావడంతో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల ఏటీజీహెచ్ వరకు విస్తరించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 16 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు తెలిపారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం, శనివారం (మే 2) ఒక్కరోజే 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 36,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ. 3.37 కోట్లుగా నమోదైంది. శుక్రవారంతో పోలిస్తే దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది.భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో టీటీడీ అధికారులు క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. దర్శనానికి ఎక్కువ సమయం పడుతున్నందున, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

# ఆకివీడు రామాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం: రఘురామ



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో కొంతకాలంగా వివాదాలకు కేంద్ర బిందువైన రామాలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం శంకుస్థాపన జరిగింది. భారీ పోలీసు బందోబస్త్ మధ్య, వేలాది మంది భక్తుల సమక్షంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఆయన అర్ధాంగి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7:14 గంటలకు నిర్ణయించిన ముహూర్తానికి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కొందరు కోర్టుకు వెళ్లారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కృష్ణశిలతో సుమారు 800 ఏళ్లు చెక్కుచెదరని విధంగా ఆలయాన్ని నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన సోషల్ మీడియా ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.గతంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ ఆలయ నిర్మాణం విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగడం, ఘర్షణలు చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ అంశం హైకోర్టు వరకు వెళ్లగా, ప్రభుత్వ అనుమతులతోనే పనులు చేపట్టాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీగా పోలీసులను మోహరించారు.

# బాబోయ్ 46.2 డిగ్రీలు...

# గూడూరులో భానుడి విశ్వరూపం



ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విచిత్రంగా మారింది. ఒకవైపు భానుడు తన విశ్వరూపం చూపిస్తుంటే, మరోవైపు అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం నాడు నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 46.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఈ సీజన్ లో ఇప్పటివరకు ఇదే రికార్డు. ఇదే సమయంలో ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో కూడా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఇందుకు పూర్తి భిన్నంగా, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముమ్మిడివరంలో అత్యధికంగా 72.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కాత్రేనికోనలో 57.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఒకే రాష్ట్రంలో ఎండ తీవ్రత, భారీ వర్షాలు అనే రెండు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.సోమవారం (మే 4) కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విజయనగరం, మన్యం, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోని 27 మండలాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరోవైపు కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, ఉత్తరాంధ్రతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షం సమయంలో రైతులు, పశువుల కాపరులు చెట్ల కిందకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

# మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం..

## తెలంగాణలో బోటింగ్‌పై కఠిన నిబంధనలు





మధ్యప్రదేశ్‌లోని బార్గి రిజర్వాయర్‌లో ఇటీవల జరిగిన ఘోర పడవ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నందున, బోటింగ్ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఏ చిన్న పొరపాటు జరిగినా సంబంధిత యూనిట్ మేనేజర్లు, ఇన్‌ఛార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారాంతాలు, సెలవు దినాలు, పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అధికారులు తప్పనిసరిగా బోటింగ్ యూనిట్ల వద్ద భౌతికంగా హాజరు కావాలని ఆదేశించింది.

బోట్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం (ఓవర్ లోడింగ్), ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించకపోవడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్‌తో సహా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పుడు బోటింగ్ సర్వీసులను తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది: సీవీ ఆనంద్ భావోద్వేగం



తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు.“ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను“ అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు.కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# ఆసక్తికర సన్నివేశం...

## ఎర్రబెల్లి దయాకర్ రావు భుజం తట్టిన చంద్రబాబు



ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుకలో ఆసక్తికర సన్నివేశం కనిపించింది. హైదరాబాద్‌లో ఈరోజు జనని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజల నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎదురుపడ్డారు. వేడుకకు హాజరయ్యేందుకు ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో వచ్చారు. రాజకీయాలను పక్కనపెట్టి వారు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

చంద్రబాబు కనిపించగానే ఎర్రబెల్లి దయాకర్ రావు దగ్గరకు వెళ్ళి, ఆయన చేతులు పట్టుకుని కాస్త వంగి నమస్కరించారు. చంద్రబాబు ఆయన భుజం తట్టి, నమస్కరించారు. దీంతో ఎర్రబెల్లి కూడా ప్రతినమస్కారం చేశారు. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి అక్కడి నుంచి ముందుకు కదిలారు.

ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఎర్రబెల్లి దయాకర్ రావు తెలుగుదేశం పార్టీలో, చంద్రబాబు నేతృత్వంలో సుదీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొంతకాలం టీడీపీలోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్)లో చేరారు. బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, దర్శకుడు శ్రీను వైట్ల, శివాజీ, కోన వెంకట్, సి. కల్యాణ్, విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు.




# జూన్ 26న లెనిన్ విడుదల

'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

-----

# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

## టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు

ద

ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ంఞజీటıపా ఃజీనిబ ంఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.



# బోల్డ్ సీన్స్‌పై కియారా యూ టర్న్

కన్నడ స్టార్ యష్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ కలిసి నటిస్తున్న టాక్సిక్ సినిమా తాజాగా సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీసింది. ముఖ్యంగా సినిమాలోని బోల్డ్ కంటెంట్, దాని చుట్టూ తిరుగుతున్న గాసిప్‌లు, మరియు హీరోయిన్ కెరీర్‌పై దీని ప్రభావం.. ఇవన్నీ కలిపి ఈ ప్రాజెక్ట్‌ను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. రీసెంట్ టైమ్స్ లో ఇండియన్ సినిమాల్లో బోల్డ్ కంటెంట్ పెరుగుతుందనేది స్పష్టమైన ట్రెండ్. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, గ్లోబల్ కంటెంట్ ఎక్స్‌పోజర్ కారణంగా డైరెక్టర్లు మరింత రియలిస్టిక్, ఎమోషనల్ మరియు బోల్డ్ ట్రీట్‌మెంట్ వైపు మళ్లుతున్నారు. అయితే ఈ విషయంలో ఆడియన్స్ యాక్సెప్టెన్స్ మాత్రం ఇంకా మిక్స్ గానే కనిపిస్తోంది. అర్బన్ ఆడియన్స్ ఈ మార్పులను స్వాగతిస్తున్నా, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మాత్రం ఇంకా కొంత రిజర్వేషన్ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాక్సిక్ లాంటి బోల్డ్ యాక్షన్ డ్రామా ఎంతవరకు కనెక్ట్ అవుతుందో అనేది ఆసక్తికర ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో, కియారా అద్వానీ కెరీర్ లో ఈ సినిమా కీలక మలుపుగా భావించవచ్చు. ఇప్పటి వరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈసారి మరింత బోల్డ్, ఇంటెన్స్ పాత్రను ఎంచుకోవడం ఒక రిస్కీ స్టెప్‌గా కనిపిస్తోంది. ఇది ఆమెను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ముఖ్యంగా సీన్ లెంగ్త్ లేదా ప్రెజెంటేషన్‌పై వచ్చిన తాజా గాసిప్‌లు, ఆమె కెరీర్ స్ట్రాటజీపై కొత్త చర్చలకు దారితీశాయి. ఈ సినిమాలో తాను నటించిన బోల్డ్ సీన్స్ ను ట్రిమ్ చేయాలని కృతి మేకర్స్ ను కోరినట్టు తెలుస్తోంది. షూటింగ్ టైమ్ లో ఈ సీన్స్ తన అనుమతితోనే జరిగినప్పటికీ, ఇప్పుడు ఫైనల్ అవుట్‌పుట్ చూశాక కృతికి ఇబ్బందిగా అనిపించి, తన డెసిషన్ ను మార్చుకున్నారని, అందుకే ఆ సీన్స్ ను సినిమాలో నుంచి తొలగించాలని డైరెక్టర్ ను సంప్రదించినట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమా షూట్ సమయంలో నటీనటులకు స్క్రిప్ట్, సీన్ బ్లాకింగ్, కెమెరా ట్రీట్‌మెంట్ గురించి ముందుగానే అవగాహన ఉంటుంది.



# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు

రాజమౌళి - మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.






# గ్రాండ్ గా గోపీచంద్ కొత్త సినిమా ప్రారంభం...

## స్నేహితులే నిర్మాతలు, ఫైట్ మాస్టర్ దర్శకత్వం

టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆదివారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా మొదలైంది. సీనియర్ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. 'గోపీచంద్ 34'గా తాత్కాలికంగా పిలుస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు.'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఉన్నత నిర్మాణ విలువలతో ఒక రూటెడ్ యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గురించి గోపీచంద్ మాట్లాడుతూ.. "ఇంతకుముందు నా సినిమాలకు వెంకట్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. ఆయన పనితనం అంటే నాకు ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో పనిచేయడం, నా స్నేహితులైన విజయ్, శశి నిర్మాణంలో ఈ ప్రయాణం మొదలుపెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. శామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మోనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు, రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని చిత్రబృందం వెల్లడించింది.

# ఆధ్యాత్మిక రహస్యాల చుట్టూ తిరిగే 'అగధ'

ఆధ్యాత్మిక రహస్యాలు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంటాయి .. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తూనే ఉంటాయి. దైవిక శక్తులు .. అవి చూపించే ప్రభావం చుట్టూ ఈ తరహా కథలు నడుస్తూ ఉంటాయి. ఇలాంటి కథలు గతంలో ఎమ్మెస్ రాజు బ్యానర్లో రూపొందాయి. కథాకథనాల పరంగా అలరిస్తూ, బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను నమోదు చేశాయి. అలాంటి ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'అగధ'. టైటిల్ తో .. ఆ టైటిల్ ను డిజైన్ చేసిన తీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమా ఇది. సీనియర్ నటి మంజుల మనవరాలు .. వనిత విజయ్ కుమార్ కూతురు 'జోవిక' ఈ సినిమాలో ప్రధానమైన పాత్రను పోషించింది. రీసెంటుగా వదిలిన ఆమె పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఉల్కా గుప్తా .. కామాక్షి భాస్కర్ల పోస్టర్లు కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచాయని చెప్పాలి. ఆదివరహా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆధ్యాత్మిక రహస్యాలు .. దైవిక శక్తుల చుట్టూ తిరిగే కథ ఇది. అందువలన గ్రాఫిక్స్ కి ఎక్కువ అవకాశం ఉన్న కంటెంట్ ఇది. సినిమా నిడివిలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయని చెబుతుండటం ఆడియన్స్ లో మరింత ఉత్కంఠను పెంచుతోంది. 85 రోజుల పాటు షూటింగు జరుపుకున్న ఈ సినిమా, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా, సంచలనాన్ని సృష్టించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.



# మే 4న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు**



**నంద్యాల బ్యూరో, మే 03 (రిపబ్లిక్ న్యూస్)**
జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ నెల 04వ తేదీ (సోమవారం)న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా సమర్పించడమే కాకుండా, వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో కూడా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్ట్రీట్ దోపిడీ కేసు ఛేదన - నిందితుడి అరెస్ట్

**రూ.20,000 నగదు, స్కూటీ స్వాధీనం**



**నంద్యాల క్రైం, మే 3, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణ పరిధిలో వెళ్తున్న వ్యక్తిని బెదిరించి డబ్బులు తీసుకున్న నిందితుడిని అరెస్టు చేసి అతని నుండి 20 వేల రూపాయల నగదు, నేరానికి ఉపయోగించిన స్కూటిని ఆదివారం స్వాధీనము చేసుకోడమయినదని ఒకటవ పట్టణ సిఐ జి.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఉదయం సుమారు 11.35 గంటల సమయంలో, గడివేముల మండలం, కరిమద్దెల గ్రామానికి చెందిన గడిగరేవులకు చెందిన వ్యక్తి వరి దాన్యం విక్రయం ద్వారా వచ్చిన రూ.20,000/- నగదుతో టీవీ కొనుగోలు నిమిత్తం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి, అక్కడి నుండి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైర్మల్ స్ట్రీట్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి, స్కూటీతో వెనుక నుండి ఢీకొట్టి, గాయాలు కలిగించి, అతనిని చంపుతాను అని బెదిరించి, అతని వద్ద ఉన్న రూ.20,000/- నగదును దోచుకున్నాడన్న ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు సమయంలో సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు సేకరించి, ముద్దాయి గురించి రాబడిన సమాచారం స్థానిక చెరువు కట్ట వద్ద వాహన తనిఖీలో భాగంగా షేక్ షఫీ అను వ్యక్తిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. అతని వద్ద నుండి బాధితుని బెదిరించి తీసుకున్న 20 వేల రూపాయల నగదు, నేరానికి ఉపయోగించిన స్కూటిని స్వాధీనం చేసుకోవడమైనది.
నిందితుడు షేక్ షఫీ నుండి స్వాధీనం చేసుకునామన్నారు. ఇతనిపై గతంలో నెల్లూరు జిల్లాలో ఉన్న చిన్న బజార్, సంతపేట, దర్గామిట్ట, కొవ్వూరు పోలీసు స్టేషన్ల పరిధిలలో దొంగతనం కేసులు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ టౌన్ పోలీసు స్టేషన్, కడప జిల్లా చెన్నూర్ పోలీస్ స్టేషన్లలో దాదాపు 12 కేసులు వున్నాయి. ఈ కేసు నమోదు చేసిన వారం రోజుల్లోనే ఛేదించిన నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, వారి సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇళ్ళకి షాపులకి సీసీ కేమరాలు బిగించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులకి సంబంధించిన సమాచారాన్ని పోలీస్ కి తెలుపాలని సమాచారము అందజేసిన వారి యొక్క వివరాలు గోప్యముగా ఉంచబడతాయని సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

# రౌడీ షీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవు**



**నంద్యాల క్రైం, మే 3, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని, పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# నంద్యాలలో ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్షలు

**పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహణం -1434 మందికి పరీక్ష.. 36 మంది గైర్హాజరు**






**నంద్యాల బ్యూరో, మే 03 రిపబ్లిక్ న్యూస్**
జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, పీఎస్సీ & కెవీఎస్సీ డిగ్రీ కాలేజ్, ఎస్వైవిసీపీ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, బస్టాండ్ సమీపంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో మొత్తం 5 నీట్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 4



కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్ పరీక్ష నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిటీ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 1,434 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, అందులో 36 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, పి.డబ్ల్యు.డి అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం (సాయంత్రం 6.00 గంటల వరకు) కేటాయించినట్లు వివరించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలీస్ బందోబస్తు మరియు ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్ష అనంతరం ఆన్సర్ షీట్లను భద్రతా నిబంధనల ప్రకారం పోస్టాఫీస్ ద్వారా పంపించే చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

# నంద్యాల ఆర్టీసీ బస్ స్టేషన్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అపరిశుభ్రతపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి**

**టాయిలెట్ల నిర్వహణ, ఫ్యాన్ల పనితీరుపై ఆక్షేపణ**

**లోపాల సవరణకు వారం రోజుల గడువు**




**నంద్యాల బ్యూరో, మే 03 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నంద్యాల జిల్లాలో ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి నంద్యాల ఏపీఎస్‌ఆర్‌టిసి బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం, టాయిలెట్ల నిర్వహణలో నిర్లక్ష్యం, అలాగే ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడం వంటి అంశాలపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా శుభ్రత, సౌకర్యాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిచేయాలని ఆదేశిస్తూ, ఇందుకు వారం రోజుల గడువు విధించారు. నిర్దేశించిన గడువులో మార్పులు కనిపించకపోతే సంబంధిత డిపో మేనేజర్ డీఎంపై కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీ సందర్భంగా బస్ స్టేషన్ పరిధిలోని ప్రతి దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడి వారి విధుల నిర్వహణపై సమాచారం తెలుసుకున్నారు. అలాగే ప్రయాణికులతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



అదేవిధంగా, 'స్త్రీ శక్తి' కార్యక్రమం కింద విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్లను కలెక్టర్ అభినందిస్తూ, వారి సేవలను ప్రశంసించారు. మహిళల భాగస్వామ్యం రవాణా రంగంలో మరింత పెరగాలని ఆకాంక్షించారు.



# వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యం

**రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**కడపలో శాశ్వత బీసీ స్టడీ సర్కిల్.. కలెక్టర్‌తో మంత్రి ఫోన్ లో చర్చలు**

**గోకుల్ సేవా సమితికి 3.5 ఎకరాల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు**

**వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మంత్రి భరోసా**



**కడప ప్రతినిధి, మే 3, (రిపబ్లిక్ న్యూస్):** వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యమని, వారి విద్యా, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం రాయచోటి పర్యటనలో భాగంగా స్థానిక కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విచ్చేశారు. ఈ నేపథ్యంలో స్థానికులు, కార్యకర్తలు, నాయకులు పుష్పగుచ్చాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని వెనుకబడిన తరగతులు, యాదవ సంఘాల అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో ఫోన్ ద్వారా ప్రస్తావించారు.
బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి:జిల్లాలో శాశ్వత ప్రాతిపదికన బీసీ స్టడీ సర్కిల్ భవనాన్ని నిర్మించాలని, అందుకు తగిన ప్రపోజల్స్ సిద్ధం చేయాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు. గోకుల సేవా సమితి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గాను 3.5 ఎకరాల స్థలాన్ని తక్కువ ధరకే కేటాయించే విషయంపై కలెక్టర్‌తో చర్చలు జరిపారు. ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్ నందు పలువురు బీసీ సంఘాల నేతలు, యాదవ సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల నేతలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను విన్నవించగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com